


ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్

హైకోర్టు ఆదేశాలతో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. 8లో▸



కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. 8లో▸



న్యూస్‌రీల్

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ రోజా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీపీఓ రోజా, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆమనగల్లు: మానవ అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన అవసరమని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ రోజా సూచించారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మానవ అక్రమ రవాణాపై శిక్షణ ఏర్పాటు చేశారు. బుధవారం ప్రారంభించిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలపై అమానుష చర్యలు జరుగుతున్నాయని ఇందులో అక్రమ రవాణా ఒకటన్నారు. వయసు, లింగబేధం లేకుండా ఆర్థిక, అవయవ, లైంగిక స్వలాభం కోసం రవాణా చేయడం తీవ్రమైన నేరమన్నారు. ప్రజలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ బృందం సభ్యులు సురేశ్, అనిల్, అంబర్‌సింగ్, మిథిలారాజ్ మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం



ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న కురుమ సంఘం సభ్యులు

చేవెళ్ల: ఆలయ నిర్మాణానికి దాతలు ఇచ్చే విరాళం వారి ఔదార్యాన్ని చాటుతాయని చేవెళ్ల కురుమ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మల్లన్న ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ బంగారి శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి రూ.30లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. దాతలు ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కురుమ సంఘం నాయకులు ఉన్నారు.

పోలీసుల అదుపులో టిప్పర్ డ్రైవర్

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులామైలారం గ్రామంలో బాలుడి మృతికి కారకుడైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ ఇస్మాయిల్ మధ్యాహ్నం టిప్పర్‌తో బైక్‌ను ఢీకొట్టడంతో 14 ఏళ్ల బాలుడు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువతి నందిని తీవ్ర గాయాలతో బయటపడింది. ప్రస్తుతం ఆమె ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఫార్మాసిటీ ఠాణా ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

జాబ్ మేళాలో 65మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 65 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రభు తెలిపారు. నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ నిర్వహించిన జాబ్ మేళాలో 200 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. వీరిలో 65 మంది వేర్‌హౌస్ సూపర్‌వైజర్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ఉద్యోగాలు పొందారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త డా. పి.విజయలక్ష్మి, కెరీర్ డవలప్‌మెంట్ సమన్వయకర్త డా.బి.రజిత, ఐక్యూఏసీ సమన్వయకర్త డా.పి.పద్మజ, ఆకాడమిక్ కోఆర్డినేటర్ డా.జి.నాగోజీ, టీఎస్‌కే సెంటర్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: పెద్దేముల్ మండలం మంబాపూర్ పెద్ద చెరువులో అడుగంటిన నీరు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

జల గండం!

వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

- గతేడాదితో పోలిస్తే రెండు మీటర్ల లోపలికి గంగమ్మ
- మర్పల్లి, దోమ మండలాల్లో ఏకంగా 20 మీటర్ల లోతుకు..
- నెర్రెలు బారిన చెరువులు, కుంటలు • బీళ్లుగా ఆయకట్టు భూములు
- సాగు చేసిన పంటలు ఎండుముఖం • ఆందోళనలో అన్నదాతలు

వికారాబాద్: రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ ప్రభావం పంటలు, తాగు నీటి అవసరాలపై పడింది. బావులు, బోర్లలో నీరు రావడం లేదు. దీంతో పంటలు ఎండుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో నీటి జాడ కనిపించడం లేదు. మూగజీవుల దాహార్తి తీర్చడం కష్టంగా మారింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి రెండు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మర్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలను ఊహించుకుంటేనే ఆందోళన మొదలవడం ఖాయం. జిల్లాలో భారీ సంఖ్యలో ఇంకుడు గుంతలు తవ్వినట్లు చెబుతున్న అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. చెక్ డ్యాంలు, చెరువులు, కుంటల్లో పూడిక తీయడం లేదు. దీంతో వర్షాలు పడిన సమయంలో వరద నీరు వృథాగా దిగువకు పోతోంది.

రెండు మీటర్ల లోతుకు..

2023 ఫిబ్రవరి మాసంలో జిల్లాలో సగటున 11 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోగా ఈ ఏడాది అదే సీజన్‌కు 13 మీటర్ల లోతుకు పడిపోయాయి. మర్పల్లి మండలంలో సగటున 21.29 మీటర్ల లోతుకు పడిపో యాయి. దోమ మండలంలోనూ సగటున 20 మీటర్ల లోతుకు జలాలు పడిపోగా దిర్సంపల్లిలో ఏకంగా 31 మీటర్ల లోతుకు వెళ్లాయి. మర్పల్లి మండలం నర్సాపూర్‌లో 28 మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి.గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో, ఆ తరువాత వర్షాలు ఒక్కసారి కూడా వర్షాలు పడక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని అధికారులు చెబుతున్నారు.



తాండూరు మండలంలో నీరు పడక వదిలేసిన బోరుబావి

> వచ్చే నెలలో మరింత లోతుకు..
>
> భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో నీటి మట్టం భారీగా తగ్గింది. వ్యవసాయబోర్లలో నీరు రావడం లేదు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తే మంచిది. వచ్చే నెలలో భూగర్భజలాలు మరింత పడిపోయే అవకాశం ఉంది. అనుమతులు లేకుండా బోరుబావుల తవ్వరాదు.
>
> – దీపారెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ అధికారి

కష్టాల 'కోట్‌పల్లి'

పెద్దేముల్: కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదు. దీంతో చివరి ఆయకట్టు భూములకు నీరందడం లేదు. 1967లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 9,200 ఎకరాలకు సాగు నీరు అందేలా డిజైన్ చేశారు. 1,784 ఎకరాల విస్తీర్ణం, 1.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యత సంతరించుకొని పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది. ధారూరు, పెద్దేముల్ మండలాల్లోని 18 గ్రామాల రైతులకు సాగునీరు అందుతోంది. దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో చివరి ఆయకట్టు భూములకు నీరందడం లేదు. ప్రాజెక్టు కుడి కాలువ తూము ద్వారా 7,200 ఎకరాలకు, ఎడమ కాలువ, బేబి కెనాల్ ద్వారా 2 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. కాలువలు దెబ్బతినడం, బెడ్, అలుగు పాడవటంతో చివరి ఆయకట్టు భూములకు నీరందక పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. 2016లో అలుగు పారడంతో సీసీబెడ్ చాలా చోట్ల దెబ్బతింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి ఉన్నా నామమాత్రపు పనులతో సరిపెట్టారు. రానున్న వర్షాకాలంలో అలుగు పారితే మరింత ప్రమాదం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుడి, ఎడమ, బేబి కెనాల్ తోపాటు ఉప పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. కుడి కాలువ పొడవు 24 కిలో మీటర్లు, 32 డిస్ట్రిబ్యూషన్ కాలువలు ఉన్నాయి. ఇవి ముళ్లపొదలతో నిండిపోయాయి. ఎడమ, బేబీ కాలువల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

పూర్తిస్థాయిలో అందని నీరు

కోట్‌పల్లి ప్రాజెక్ట్‌పై రెండు మండలాల రైతుల ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా యాసంగి, వానాకాలంలో వరి, వేరుశెనగ పంటలు సాగు చేస్తారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరితే ఏటా రెండుసార్లు పంటలు పండించవచ్చు. ధారూరు మండలం నాగసమందర్, అల్లాపూర్, రుద్రారం, గట్టెపల్లి, బూర్గుగడ్డ గ్రామాలకు, పెద్దేముల్ మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతోంది.

వలసబాట

కోట్‌పల్లి ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు కాలువలను పూడ్చేసి పంటలు సాగు చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. మంబాపూర్‌లో కాలువ స్థలాలను కబ్జా చేసి హోటళ్లు ఏర్పాటు చేశారు. మరి కొంత మంది చివరి ఆయకట్టు రైతులు పంటలు పండక అప్పుల పాలై భూములను వదిలి ముంబై, పూణే వంటి ప్రాంతాలను వలస వెళ్లారు.



కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి రైతు గాదె రామయ్య పొలంలో నల్లాను తలపిస్తున్న బోరుబావి

వట్టిపోయిన 'కాగ్నా'

తాండూరు: నియోజకవర్గంలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. కాగ్నా నదిలో నీటి జాడ కనిపించడం లేదు. చెరువుల్లో నీరు లేక వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కోసం రైతన్నలు బోరుబావులు తవ్వుతున్నారు. నిబంధనల ప్రకారం 120 మీటర్ల కంటే లోతు తవ్వరాదు. కానీ 300 నుంచి 400 మీటర్ల లోతు వరకు వేళ్తున్నారు. వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. భానుడి ప్రతాపానికి భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి. బోరుబావుల్లో నీరు లేకపోవడంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి తొలి రోజుల్లోనే నీటి ఎద్దడి నెలకొంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటని అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు. గతేడాది ఆగస్టు నెలలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు మెరుగుపడ్డాయి. ఆ తర్వాత వానలు పడకపోవడంతో ప్రతి నెలా భూగర్భ జల మట్టం పడిపోతూ వస్తోంది.



తాండూరు: వట్టిపోయిన కాగ్నానది

13.13 మీటర్ల లోతులో..

జిల్లాలోని 20 మండలాల్లో ప్రతి నెలా 17నుంచి 26వ తేదీ వరకు భూగర్భ జల వనరుల ఏ మేరకు ఉన్నాయి అనే విషయాన్ని ఆ శాఖ ఆధ్వర్యంలో లెక్కిస్తారు. 73 కేంద్రాల నుంచి భూగర్భ జలాల వివరాలను ఫిబ్రవరిలో పరిశీలించి రికార్డు చేశారు. జిల్లాలో సగటున 13.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నట్లు గుర్తించారు. ఉష్ణోగ్రతలు పెరిగితే 25నుంచి 30 మీటర్ల వరకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పలు మండలాల్లో 20 నుంచి 25 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. మరి కొన్ని మండలాల్లో భూగర్భజలాలు కొద్దిగా తగ్గాయి.

21.29 లోతులోకి భూగర్భజలాలు

మర్పల్లి మండలంలో గతేడాది మే నెల లో 17.07 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో సేకరించిన వివరాల ప్రకారం 21.29 లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయని అధికారులు గుర్తించారు. మే నెల నాటికి మరింత తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. బొంరాస్‌పేట్ మండలం అంసన్‌పల్లిలో 29.22 మీటర్లు, బూరాన్‌పూర్‌లో 25.95 మీటర్లు, పెద్దేముల్ మండలం నాగులపల్లిలో 32.38 మీటర్లు, తాండూరు మండలం జినీగుర్తి గ్రామంలో 24.13 మీటర్లు, ఉద్దండాపూర్‌లో 23.91 మీటర్ల వరకు భూగర్భజలాలు పడిపోయాయి.

వర్షపు నీరు వృథా

ప్రతి ఏటా జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టినా, సమర్థవంతంగా అమలు చేయకపోవడంతో వృథా అవుతున్నాయి. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఫామ్‌పాండ్, సోక్ పిట్, ఇంకుడు గుంతలు నిర్మించారు. చాలా ప్రాంతాల్లో అవి పూడిపోయాయి. దీంతో వర్షపు నీరు దిగువకు వృథాగా పోతోంది.

680 అడుగులు వేసినా..

తాండూరు మండలం ఐనెల్లి గ్రామానికి చెందిన దళిత రైతు చిన్న నర్సింహులు ఉల్లి, కుసుమ పంటలు సాగు చస్తున్నాడు. ఉన్న బోరుబావిలో నీరు ఇంకిపోయింది. ఇటీవల బోరుబావి తవ్వించాడు. 300 ఫీట్ల తర్వాత కొంత నీరు వచ్చింది. మరి కొన్ని ఫీట్లు డ్రిల్లింగ్ చేస్తే నీరు వస్తాయని ఆశతో 680 అడుగుల వరకు బోరు వేయించాడు. అయినా చుక్క నీరు పడలేదు. రూ.90 వేల వరకు ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయాడు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి, అడ్కిచర్ల గ్రామాల్లో సైతం భూగర్భజలాలు అడుగంటాయి.



తాండూరు: 680 అడుగల లోతు వరకు డ్రిల్లింగ్ చేసినా నీరు పడని బోరుబావిని చూపుతున్న ఐనెల్లి రైతు చిన్న నర్సింహులు

ప్రలోభాలకు గురికావొద్దు

- యువత చేతుల్లోనే దేశ భవిష్యత్
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఓట్ ఫర్ ష్యూర్ పేరుతో 5కే రన్
- ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఓట్ ఫర్ షూర్ పేరుతో వికారాబాద్‌లో 5కే రన్ నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఆలంపల్లి చౌరస్తా వరకు 5కే రన్ సాగింది. ఓటరుగా నమోదు, వినియోగంపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ఓటు ఎంతో అమూల్యమైనదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ప్రజల ప్రయోజనాలను ఆకాంక్షించే నేతలను ఎన్నుకోవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి తల్లి దండ్రులకు పేరు తేవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 80శాతానికి మించి ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. యువకులు ఓటు హక్కుపై కుటుంబ సభ్యులు, బంధువులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సత్తార్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

అనంతగిరి: జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మిషన్ భగీరథ, ఇంట్రా ఈఈ, ఏఈలు, ఎంపీడీఓలు, ఏపీఓ, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేసి నీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. చెడిపోయిన బోర్లను వెంటనే బాగు చేయించాలని సూచించారు. అలాగే జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేయాల న్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రశాంతంగా జరగాలి

కొడంగల్: మహబూబ్‌నగర్ జిల్లా శాసనమండలి ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు చెందిన 56 మంది ప్రజా ప్రతినిధులు గురువారం ఉదయం కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఓట్లు వేస్తారని తెలిపారు. అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రం వద్ద వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రశాంతంగా ఓటింగ్ జరగడానికి అవకాశం కల్పించాలని సూచించారు. ఇందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలన్నారు. బుధవారం కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఓటరు జాబితాలోని పేర్లను సరి చూసుకున్న తరువాతే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

కొడంగల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బుధవారం కడా కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేతిపంపులు, బోర్‌వెల్స్ పనితీరుపై ఆరా తీశారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనివార్య కారణాల వల్ల మిషన్ భగీరథ నీరు నిలిచిపోతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మిషన్‌భగీరథ ఎస్‌ఈ ఆంజనేయులు, ఈఈలు బాబు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



అనంతగిరి: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు పయనించాల్సిన అవసరం ఉందని ఆర్గానిక్, నేచురల్ ఫామింగ్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నారాయణపూర్ రైతు వేదికలో బుధవారం ప్రకృతి, సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం తదితర వాటి తయారీ పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయం, సహజ సిద్ధమైన పంటలపై రైతులు శ్రద్ధ చూపాలన్నారు. సహజంగా పండించిన కూరగాయలకు, పండ్లకు మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయన్నారు. వీటితో ఆరోగ్యానికి సైతం మేలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వాటిని రైతులు ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. వికారాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల ఉద్యాన అధికారులు సత్తార్, చక్రపాణి, అధికారులు కమల, అబ్దుల్‌గఫార్, అర్చన,విజయ్ కుమార్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీలో రూ.2.5లక్షల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో చన్గోముల్ ఎస్ఐ

పూడూరు: ఎన్నికల సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.2.5 లక్షలు పట్టుబడ్డాయని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.2.5 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది ఉన్నారు.

కలప లారీ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

కొడంగల్: అక్రమంగా తరలిస్తున్న కలప లారీను ఎస్ఐ భరత్‌రెడ్డి మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకొని అటవీశాఖాధికారులకు అప్పగించారు. పోలీసులు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా కలపను తరలిస్తున్న ఓ లారీ పట్టుబడింది. కలప రవాణాకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. విచారణ కోసం ఫారెస్టు కార్యాలయానికి తరలించి అధికారులకు అప్పగించారు. ప్రతి రోజు ఇలాంటి వాహనాలు తిరుగుతున్నా అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. కొడంగల్ అటవీ శాఖ క్షేత్రాధికారి స్థానికంగా ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫారెస్టు అధికారులు చేయాల్సిన పనులను పోలీసులు చేస్తున్నారనే చర్చ సాగుతోంది.

ఫొటో జర్నలిస్టులపై దాడులు అనైతికం

హిమాయత్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడి పత్రికా స్వేచ్ఛపై దాడి అని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలను కవర్ చేసేందుకు వెళ్లిన ఫొటో జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమన్నారు. దీనిని తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం దేశోద్ధారక భవన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఎం.డి.అలీముద్దీన్ నేతలు జి.బాలస్వామి, సయీద్ మజార్, ఇ.జనార్దన్‌రెడ్డి, రామకృష్ణ, పిప్పళ్ల వెంకటేష్, సురేష్ రెడ్డి, ఇ.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఈతకు దిగి కార్మికుడి మృతి

కందుకూరు: మద్యం మత్తులో ఈత కొట్టడానికి బావిలో దిగిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లేమూరు పరిధిలో ఓ ఫాం హౌస్‌లో కాంట్రాక్టర్ పని చేసిన వారికి మంగళవారం రాత్రి విందు ఇచ్చాడు. కాగా మలక్‌పేటలోని హౌసింగ్ బోర్డు కాలనీని చెందిన శైలద దుర్గారావు(54) కూలీ పనులకు వచ్చి విందులో పాల్గొన్నాడు. అనంతరం మద్యం మత్తులో అక్కడే ఉన్న బావిలో ఈత కొట్టడానికి దిగాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా బావిలో నీట మునిగి మృతి చెందాడు.

ఆదిబట్ల చైర్మన్ ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్

- ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశం
- కలెక్టర్‌కు ఉత్తర్వులు
- సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: హైకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రంగారెడ్డి కలెక్టర్ శశాంక మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని బుధవారం సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల కౌన్సిలర్లు గతంలో చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన 13 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. అనంతరం జనవరి 9వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆర్తికగౌడ్, కళమ్మలను తొలగించారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పీఠాలు ఖాళీగా ఉంది.

కోర్టు జోక్యంతో..

ఆదిబట్ల మున్సిపాలిటీ కొత్త చైర్మన్‌గా కావడానికి మర్రి నిరంజన్‌రెడ్డి శతవిధాలా ప్రయత్నం చేశారు. సొంత పార్టీకి చెందిన నాయకుడిపై అవిశ్వాసానికి పురిగొల్పడంతో ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ సైతం అయ్యారు. ఈ క్రమంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలుమార్లు నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. దీంతో జనవరి 9వ తేదీ నుంచి మార్చి నెల దాటినా నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో నిరంజన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం కోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగంలో చలనం మొదలైంది.

మే 6న ఎన్నిక

హైకోర్టు ఆదేశాలతో ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ చర్యలు మొదలు పెట్టారు. మే 6న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రిసైడింగ్ అధికారిని నియమించి మే 4వ తేదీ వరకు అందరి కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. 6వ తేదీ ఉదయం చైర్మన్, మధ్యాహ్నం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. దీంతో కొన్ని రోజులుగా ఎదురుచూస్తున్న ఆశావహులు ఆనందంలో మునిగి తేలుతున్నారు.

మళ్లీ క్యాంపునకు

చైర్మన్, వైస్ చైర్మన్ తొలగించడానికి ఏకంగా 20 రోజుల వరకు క్యాంపు రాజకీయాలు చేశారు. మళ్లీ తేది ప్రకటన కావడంతో క్యాంపులకు వెళ్లే ఆస్కారం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పటికే మర్రి నిరంజన్‌రెడ్డికి స్థానికంగా ఉన్న ఓ బడా ప్రజాప్రతినిధి అనుకూలంగా లేకపోవడంతో ఎవరి పైరవీల్లో వారు నిమగ్నమయ్యారు. ఈ దశలో మళ్లీ క్యాంపులకు వెళ్లక తప్పదని స్థానిక రాజకీయవేత్తలు జోరుగా చర్చించుకుంటున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తాం



జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని చేస్తాం. అధికారికంగా ఎన్నికకు ఆదేశాలు జారీ చేశారు. 15 మంది కౌన్సిలర్లకు మే 4వ తేదీ వరకు ప్రత్యేక సమావేశం మెమోను అందజేస్తాం. 6న ప్రత్యేక సమావేశానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల

కోర్టును ఆశ్రయించాం..



రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు తేదీ ఖరారు చేయడంలో జాప్యం జరిగింది. హైకోర్టు ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అధికారుల్లో చలనం వచ్చింది. ప్రభుత్వంలో ఉండి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. 13 మంది కౌన్సిలర్లు నా వెంటే ఉన్నారు.

– మర్రి నిరంజన్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్

ప్రజా అవసరాల మేరకు పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చ

కుల్కచర్ల: ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడంతో ఒకవైపు మహిళలకు మరోవైపు ఆర్టీసీకి లాభం చేకూరుతుందంటూ కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆసక్తికర చర్చ కొనసాగింది. ఉచిత కరెంట్ అంటూ ప్రకటనలు చేశారు కానీ ప్రజలందరి దగ్గర డబ్బులు తీసుకుంటున్నారు.. ఎండుతున్న పంటలను పరిశీలించి రైతులను ఆదుకుంటామన్న హామీలు అమలు కావడం లేదని మండల కోఆప్షన్ సభ్యుడు జుబేర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖ అధికారి విశ్వనాథ్ స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం సర్వే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్‌లు మురళీధర్, ప్రభులు, ఎంపీఓ కరీం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న సిద్ధలింగ మహాస్వామి



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మఠాధిపతులు

జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వామి

కొడంగల్ రూరల్: సమాజం అభివృద్ధి సాధించాలంటే సంస్కృతి సంప్రదాయాలతో హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని జగద్గురు శ్రీనిరంజన మఠం పీఠాధిపతి డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో శ్రీబసవేశ్వర స్వామివారి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ దైవారాధన చేయడంతో సాధ్యం కానిది ఏదీ ఉండదని ఉద్బోధించారు. నిర్మలమైన మనసుతో భగవంతుని ఆరాధిస్తే శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని అన్నారు. రోజులో కొంత సమయం ఆధ్యాత్మికతతో దైవారాధన చేయడంతో మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు మహాస్వామిని శాలువాలు కప్పి సత్కరించారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, రెడ్డప్ప, తాండూరు, కోస్గి నియోజకవర్గాల వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

గాయాలతో ఉన్న మహిళ వివరాలు లభ్యం

ధారూరు: అనుమానాస్పద స్థితిలో గాయాలతో ఉన్న మహిళ వివరాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బుధవారం సాక్షి దినపత్రికలో ఇచ్చిన వార్తకు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మంగళవారం రాత్రి ధారూరు సమీపంలో స్పృహతప్పి పడిపోయిన మహిళ వివరాలను ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమెను పోలీసులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఎస్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని అవుసుపల్లి గ్రామానికి చెందిన ఇంటెంట లక్ష్మి(45)గా గుర్తించారు. ఆమె దినసరి కూలీ. మూడు రోజుల నుంచి కూలీ పనులకు వెళ్లకుండా హోలీ సందర్భంగా ఇళ్ల వద్ద పాటలు పాడుతూ ఆమె డబ్బులు తీసుకుంటుంది. ఈ క్రమంలో ధారూరులోని పిండి గిర్నికి వెళుతున్నట్లు భర్త లక్ష్మయ్యకు చెప్పి బయలుదేరి తిరిగి ఇంటికి రాలేదు. రుద్రారం గ్రామంలో ఉన్న తన చెల్లెలు దగ్గరకు వెళ్లి ఉంటుందని భావించి పిల్లలతో కలిసి ఆయన నిద్రపోయారు. వార్తలో వచ్చిన ఆమె ఫొటోను చూసి గుర్తు పట్టిన భర్త పోలీసులను సంప్రదించి వివరాలను తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యాలాల: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని కోకట్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోకట్ శివారులో చెక్‌డ్యాంలో సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి తలపై తెల్లవెంట్రుకలు, ఒంటిపై నలుపు కలర్ టీషర్టు, ఖాకీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ గుర్తించిన వారు 8712670054 సంప్రదించాలని కోరారు.

హెచ్ఐవీ కేసుల నమోదుకు పోర్టల్

తాండూరు: హెచ్ఐవీ ఎయిడ్స్ కేసుల నమోదును ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హెచ్ఐవీ, లెప్రసీ, టీబీ ప్రోగ్రాం జిల్లా అధికారి రవీంద్రనాయక్ అన్నారు. బుధవారం జిల్లా వైద్యశాఖ, హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో హెల్త్ మేనెజ్‌మెంట్, ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్ పోర్టల్‌పై సంబంధిత అధికారులు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ ఎయిడ్స్‌పై సందేహాలు ఉన్న వారు టోల్ ఫ్రీ నంబర్ 1097కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. వ్యాధి నియంత్రణ కోసం తాండూరులో ఐసీటీసీ కేంద్రం, డీఎస్‌ఆర్సీ కేంద్రాల ద్వారా వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మూర్తి, ఏఆర్‌టీ వైద్యాధికారి సమిఉల్లా, ప్రోగ్రాం అధికారి రతన్‌లాల్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



సిబ్బందికి పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆగిఉన్న బైక్‌ను ఢీకొట్టి..

ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో తీవ్రంగా గాయపడిన మహేందర్

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తమ్మలోనిగూడెం గేట్ సమీపంలో బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మాల్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కిషన్‌పల్లికి చెందిన మహేందర్ బుధవారం సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో కిషన్‌పల్లి గేట్ వద్ద ఆయన బైక్‌ను నిలిపివేశాడు. మాల్ నుంచి యాచారం వెళ్తున్న నగరంలోని లెనిన్‌నగర్‌కు చెందిన యాదగిరి బైకుతో ఆగిఉన్న మహేందర్ బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థాల స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నారని పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి రోడ్డు సమీపంలో సామ రెసిడెన్సీ నందు రాళ్లకు రంధ్రాలు వేసి పేలుస్తున్నారనే సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. వెంకటేష్, తరుణ్, గణేష్ అక్రమంగా పేలుడు పదార్థాలు ఉపయోగించారు. ఈ మేరకు పోలీసులు వీరిని అరెస్టు చేశారు. 35 డిటోనేటర్లు, 35 జిలెటిక్స్ స్టిక్స్, మెగ్గర్‌బాక్స్ కనెక్టింగ్ కరెంట్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 122 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 27, పీఏసీఎస్ 61, డీసీఎంఎస్ 27, ఏఎంసీ మూడు, ఇతరులు నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం 1,90,350 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలతో పాటు, ప్యాడీ క్లీనర్, టార్పలిన్స్, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, మిల్లర్ల సంఘం ప్రతినిధులు బాలీశ్వర్ గుప్తా, శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

పంచాయతీ కార్యదర్శులను ఆదేశించిన డీపీఓ సుధారాణి



కరన్‌కోట్‌లో తాగునీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీపీఓ సుధారాణి

తాండూరు రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) సుధారాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బెల్కటూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ముందుగా బెల్కటూర్ గ్రామంలో శ్మశాన వాటిక వద్ద ఉన్న బోరు మోటారు మరమ్మత్తులు చేయించాలని కార్యదర్శి పార్వతమ్మను ఆదేశించారు. గ్రామాల్లో నీటి కుళాయిల వద్ద ఆన్‌ఆఫ్ సిస్టంలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ ట్యాక్స్ రూ.6 లక్షల కట్టాల్సి ఉన్నా కేవలం రూ.లక్ష మాత్రమే కట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత కరన్‌కోట్ గ్రామంలో డీపీఓ సుధారాణి పర్యటన చేశారు. గ్రామంలో ఐదు వాటర్ ట్యాంక్‌లు ఉన్నప్పటికీ వడ్డెరబస్తీలో ఉన్న వాటర్ ట్యాంకుకు పైపలైన్ కనెక్షన్ లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కార్యదర్శి ఆనంద్‌రావుకు డీపీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ రతన్‌సింగ్, మిషన్ భగీరథ ఏడీ ప్రతిభ, ఏపీఓ నరోత్తంరెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, శరణుబసప్పలు పాల్గొన్నారు.

మాదిగల అభ్యున్నతికి ఎమ్మార్పీఎస్ కృషి

జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్



ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

పరిగి: మాదిగల అభ్యున్నతికి ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ కృషి చేస్తుందని సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించడంతో ఎమ్మార్పీఎస్ చివరి దశలో ఉందన్నారు. ఈ ఉద్యమాన్ని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో మాదిగ జాతి ముందుకు సాగుతుందన్నారు. జిల్లాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఎమ్మార్పీఎస్ దృష్టికి తీసుకువస్తే పోరాటం చేస్తామన్నారు. వచ్చే నెల 2న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి లాజరేస్, నాయకులు రమేశ్, శివాజీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ దందా

రెండు ట్రాక్టర్లు సీజ్



పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్

పెద్దేముల్: అక్రమ ఇసుక వ్యాపారం పెద్దేముల్ మండలంలో జోరందుకుంది. వారంలో మూడు లేదా నాలుగు అక్రమ ఇసుక ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్న దందా మాత్రం ఆగటం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తున్నారు. బుధవారం మండలంలోని రెంగోండి నుంచి వస్తున్న రెండు ట్రాక్టర్‌లలో అక్రమ ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సీజ్ చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుకపై దాడులు చేసినా తగ్గక పోవడం సిగ్గు చేటని అధికారులు అంటున్నారు. నిత్యం రెంగోండి శివారులోని వాగుల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా బహిరంగంగా తరలిస్తున్నారు. గత పది రోజుల క్రితం ఆరు అక్రమ ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానాలు విధించినా లాభం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం రూ.600లకు ఓ ట్రాక్టర్ అనుమతి ఇస్తున్నా, ఇసుక దళారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంతో ట్రాక్టర్‌ల యజమానులపై పోలీస్ కేసు నమోదు చేసి సీజ్ చేయాలని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శుభప్రద్ పటేల్

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్

అనంతగిరి: మట్టిలో మాణిక్యాలను వెలికితీసే వారు ఉపాధ్యాయులని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని ఆలంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన మారుతి పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మారుతి తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం చేసిన వ్యక్తుల్లో ఒకరని ఆయన కొనియాడారు. ఆయన పదవీ విరమణ వారి తల్లిదండ్రుల ముందు జరగడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, కార్యదర్శి అమర్‌నాథ్, ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మియాపూర్: మియాపూర్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ద్వారతోరణ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి యంత్ర విగ్రహ విమాన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు.